ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 03.07.2024 సమయం: 1310 గంటలు

ముఖ్యాంశాలు

1. విపక్షాలు పెద్దల సభను అవమానపరిచే రీతిలో వ్యవహరిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోది వ్యాఖ్యానించారు. కాగా విపక్షాలు ప్రధాని ప్రసంగం మధ్యలో సభ నుంచి వాకౌట్ చేశాయి.
2. హైదరాబాద్ చర్లపల్లి జైలు నుంచి 213 మంది ఖైదీలు ఈరోజు విడుదలవుతారు.
3. ఈ నెల 6వ తేదీన జరిగే రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.
4. దేవదాయ భూముల్లో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని ఆ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు.

ప్రధాని - రాజ్యసభ

దేశ ప్రజలు మూడవసారి ఎన్.డి.ఏకి అవకాశం ఇచ్చారని, దీనిని సద్వినియోగం చేసుకుంటూ దేశాన్ని ప్రగతిపథంలో నడుపుతామని ప్రధానమంత్రి నరేంద్రమోది చెప్పారు. దేశాన్ని ప్రగతి పథంలో నడిపేందుకు అనేక కీలక నిర్ణయాలు తీసుకోవలసి వుందని ఆయన అన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ఈవేళ రాజ్యసభలో ఆయన ధన్యవాదాలు తెలుపుతూ... తమ విజయాన్ని కొన్ని శక్తులు జీర్ణించుకోలేకపోతున్నాయని, కానీ ఎన్.డి.ఏ ప్రభుత్వం మరో రెండు దశాబ్దాల పాటు కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. విపక్షాల నిరసనల మధ్య ప్రధానమంత్రి తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ... విపక్షాలు పెద్దల సభను అవమానపరిచే రీతిలో వ్యవహరిస్తున్నాయని వ్యాఖ్యానించారు. దేశ ప్రజలు విపక్షాలకు ఓట్ల రూపంలో తగు తీర్పునిచ్చినప్పటికీ, అవి తమ తీరును మార్చుకోవడం లేదని నరేంద్రమోది వ్యాఖ్యానించారు.

డెస్క్

ఖైదీలు

హైదరబాద్ చర్లపల్లి జైలు నుంచి 213 మంది ఖైదీలు ఈ రోజు విడుదల కానున్నారు. వీరిలో 205 మంది యావజ్జీవ శిక్ష పడిన వారు, ఎనిమిది మంది అంతకన్నా శిక్షపడిన వారు ఉన్నారు. దీర్ఘకాలంగా జైళ్లలో మగ్గుతున్న తమ వారిని విడుదల చేయాలంటూ ఖైదీల కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రజా పాలనలో దరఖాస్తులు అందచేయగా, వాటిని పరిశీలించిన గవర్నర్ ఆమోదంతో ప్రభుత్వం వారికి క్షమాభిక్ష ప్రసాదించిందని ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలియజేసింది. కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాల ఆధారంగా ముందస్తు విడుదలకు అర్హులైన వారి వివరాలను అధికారులు ఉన్నత స్థాయి కమిటీ ముందుంచారు. ఈ కమిటీ సమర్పించిన జాబితాను రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. గవర్నర్ ఆమోద ముద్ర వేయడంతో ఖైదీల ముందస్తు విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం గత రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది ఈ ప్రకటన పేర్కొంది. వీరందరికి జైలులో వివిధ

వృత్తులకు సంబంధించిన నైపుణ్యాభివృద్ధి శిక్షణలు ఇచ్చారు. మెరుగైన ప్రవర్తన ద్వారా సమాజంలో తిరిగి కలవటానికి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

MSL

ముఖ్యమంత్రుల సమావేశం

తెలంగాణా, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం హైదరాబాద్ లో ఈ నెల 6న జరగనున్న నేపథ్యంలో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఏర్పాట్లను సమీక్షించారు. హైదరాబాద్ లోని జ్యోతి బా ఫూలే ప్రజభవన్ లో ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం నిర్వహించాలని నిర్ణయించటంతో, అందుకు తగిన ఏర్పాట్ల పై వీరు సమీక్షించారు. మంత్రులు D శ్రీధర బాబు, కోమటి రెడ్డి వెంకట రెడ్డి కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. రెండు రాష్ట్రాల మధ్య దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న అంశాలను చర్చించి పరిష్కరించుకునేందుకు సమావేశం కావాలని ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి N. చంద్రబాబు నాయుడు ప్రతిపాదించగా, అందుకు తెలంగాణ ముఖ్యమంత్రి A రేవంత్ రెడ్డి అంగీకారం తెలియజేశారు. ఈ సందర్భంగా భద్రతా ఏర్పాట్లనూ కట్టు దిట్టం చేస్తున్నారు.

MSL

సీఎం సహాయనిధి

ముఖ్యమంత్రి సహాయనిధి దరఖాస్తులను ఇక మీదట ఆన్ లైన్ ద్వారా స్వీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 15వ తేదీ నుంచి ఈ కొత్త విధానం అమలులోకి వస్తుంది. ఇందుకోసం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా cmrf.telangana.gov.in అనే వెబ్‌సైట్‌ను రూపొందించారు. ఈ సహాయ నిధి పంపిణీ పక్కదారి పట్టకుండా పారదర్శకతతో నిర్వహించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జారీ చేసిన ఆదేశాల మేరకు అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు.

పీటీసీ...హైదరాబాద్

బోనాలు

ఈ నెల 7న ప్రారంభమయ్యే ఆషాఢ బోనాల జాతరకు సంబంధించి ప్రధాన ఆలయాల్లో పనులు అన్నీ పూర్తయ్యాయని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన బ్యాంక్ చెక్ లను రెండు రోజుల్లో అందచేస్తున్నట్లు చెప్పారు. దేవాలయాల వద్ద భద్రత, పార్కింగ్, విద్యుత్ బ్యారికేడ్ల, తాగునీరు,మరుగుదొడ్ల సదుపాయాల కల్పన పనులు పూర్తి కావచ్చాయని వివరించారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా, ఆలయా వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్టు కలెక్టర్ వివరించారు.

పీటీసీ....హైదరాబాద్

ముఖ్యమంత్రి డిల్లీ పర్యటన

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి డిల్లీ బయలుదేరి వెళ్ళారు. డిల్లీ పర్యటనలో భాగంగా ఆయన కాంగ్రెసు పార్టీ అధిష్టానంతో సమావేశమై పార్టీ అంతర్గత అంశాలను చర్చించనున్నారు. అలాగే, పలువురు కేంద్ర మంత్రులతో కూడా సమావేశమై రాష్ట్రానికి చెందిన పలు అంశాలపై లోతుగా చర్చించే అవకాశం ఉంది.

MSL

ఖమ్మం - వనమహోత్సవం

ఖమ్మం జిల్లా – సత్తుపల్లి డివిజన్, గొల్లగూడెం గ్రామంలో అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ఈరోజు వనమహోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా సుమారు 20 కోట్ల మొక్కలు నాటాలని నిర్ణయించినట్టి చెప్పారు. రావి, వెదురు, మర్రి, నేరేడు, ఉసిరి, చింత, వేప తదితర మొక్కలు నాటుతామని తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

పిటిసి ఖమ్మం

వనమహోత్సవం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వన మహోత్సవం కింద ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 65.14 లక్షల మొక్కలు నాటాలన్న లక్ష్యాన్ని సాధించేందుకు చర్యలు తీసుకోవాలని, నాటిన ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ తప్పనిసరి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ జిల్లా ఆదేశించారు. ప్రతి పాఠశాల ఆవరణలో మునగ, కరివేపాకు, చింత, ఉసిరి, వెలగ మొక్కలు ఉండేలా చూసుకోవాలని అధికారులను కోరారు.

పీటీసీ....భద్రాద్రి కొత్తగూడెం

ఆలయ భూములు-కొండా

దేవదాయ భూములను కాపాడుకోవడంతో పాటు వాటి ద్వారా అదనపు ఆదాయం పొందేందుకు సౌర విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని,అందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని, దేవదాయశాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. సాగుచేయని, ఆర్థికంగా లాభసాటికాని భూముల్లో ఈ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని, అలాంటి భూముల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అన్నారు. సౌర విద్యుత్ ప్లాంట్ల ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్ ను డిస్కంలకు విక్రయించడం ద్వారా ఆదాయం పొందవచ్చని హైదరాబాద్ లో నిన్న నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి చెప్పారు. దేవదాయ శాఖలో పదోన్నతులు , బదిలీలపై త్వరలో మార్గదర్శకాలు జారీ చేస్తామని ఆమె చెప్పారు.

డెస్క్

అభియాన్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో రేపు, గుండాలో ఎల్లుండి సంపూర్ణత అభియాన్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. ఈ కార్యక్రమం కింద ఇంటింటి సర్వే ద్వారా గర్భిణుల పేర్ల నమోదు, వారికి ప్రత్యేక పౌష్టికాహారం అందచేత, రక్తపోటు, మధుమేహం పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. వచ్చే మూడు నెలల్లో ప్రణాళిక బద్ధంగా సంపూర్ణత అభియాన్ ను నిర్వహించాలని అన్నారు. .

వ్యవసాయానికి సంబంధించి భూసార పరీక్షలు చేసి రైతులకు సాయిల్ హెల్త్ కార్డ్ లు అందించాలని, మహిళా సంఘాలకు రుణాలు పంపిణీ వంటి అభివృద్ధి పనులను పర్యవేక్షించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

పీటీసీ....భద్రాద్రి కొత్తగూడెం

నీతి అయోగ్

అసిఫాబాద్ జిల్లాలో నీతి అయోగ్, సంపూర్ణత అభియాన్ లక్ష్యాలను సాధించేందుకు సంబంధిత శాఖల అధికారులు పూర్తి వివరాలు సమర్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. ఏప్రిల్ 1 నుండి జూన్ 30వ తేదీ వరకు విద్య, వైద్యం, వ్యవసాయం, సామాజిక అభివృద్ధి తదితర విభాగాలలో చేపట్టిన కార్యక్రమాలపై నివేదిక అందచేయాలని సూచించారు.వివిధ శాఖల అదికారులతో ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు.

పీటీసీ..అసిఫాబాద్

వ్యవసాయం-తుమ్మల

ఆర్థిక వెసులుబాటును బట్టి రైతు సంక్షేమ పథకాలన్నిటిని అమలు చేస్తామని వ్యవసాయం శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. పంట రుణాల మాఫీ, రైతు భరాసా, పంటలు, రైతు బీమా పథకాల కింద ప్రభుత్వం వచ్చే మూడు నెలల్లో సుమారు 60 వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తుందని చెప్పారు. హైదరాబాద్ రాజేంద్ర నగర్ సమీకృత ప్రయోగశాల భవన సముదాయాన్ని ఆయన నిన్న ప్రారంభి, అనంతరం వ్యవసాయ,ఉద్యానవన శాఖ అధికారులతో ఏర్పాటైన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఉద్యాన పంటలను, కూరగాయల సాగును ప్రోత్సహించాలని, అందుకోసం శాస్త్రవేత్తలు, అధికారులు వారానికి రెండు మండలాల్లో పర్యటించి సాగుదారులకు సలహాలు, సూచనలు ఇవ్వాలని మంత్రి సూచించారు.

డెస్క్

అంగన్ వాడీ

సంగారెడ్డి జిల్లాలో అంగన్వాడీ వృద్ధి మేలాను పురస్కరించుకొని జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి కాశీపూర్ ,నిజాంపూర్ అంగన్వాడి కేంద్రాలను సందర్శించారు. పిల్లల్లో ఎత్తుకు తగ్గ బరువు లేని, వయసుకు తగ్గ బరువు లేని వారిని గుర్తించి వారికి అదనపు పోషకాహారం అందచేస్తామని ఆమె చెప్పారు.

పీటీసీ...సంగారెడ్డి